సాక్షి
కర్నూలు
గురువారం । 29 । ఆగస్టు । 2024



నేడు బదిలీలకు కౌన్సెలింగ్

గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. గ్రేడ్-5,6 పంచాయతీ కార్యదర్శులకు జెడ్పీలో కౌన్సెలింగ్ ఉంటుంది. ..8లో



నిత్యాన్నదానానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన శింగంశెట్టి స్వప్న హైదరాబాద్‌కు చెందిన సాయిమౌనిక రూ.1,00,116 చొప్పున వేర్వేరుగా బుధవారం విరాళాలు అందించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,629.05
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	: 90
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 30,394
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:10,107

న్యూస్‌రీల్

17 మండలాల్లో వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వివిధ మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకు 17 మండలాల్లో వాన కురిసింది. చిప్పగిరిలో 29.6 మి.మీ, మద్దికెరలో 25.2, తుగ్గలిలో 16.8, ఆలూరులో 16.4, ఆస్పరిలో 14.6, క్రిష్ణగిరిలో 12.8, వెల్దుర్తిలో 12.2, కౌతాళంలో 6.8, కోసిగిలో 6.2 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తం సగటున 6.2 మి.మీ వర్షం కురిసింది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మి.మీ ఉండగా.. ఇప్పటి వరకు 170.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

రేపటికి బదిలీల ప్రక్రియ పూర్తి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)లో ఈ నెల 30వ తేదీ నాటికి బదిలీల ప్రక్రియను పూర్తి చేసేందుకు కసరత్తు జరుగుతోంది. ఇందుకోసం కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లు కర్నూలు డీఆర్‌డీఏ కార్యాలయంలో సమావేశమై గురువారం చర్చించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బదిలీలకు అర్హులైన, ఐదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న వారు 79 మంది ఉండగా.. మరో 66 మంది రిక్వెస్ట్ బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. బదిలీల ప్రక్రియ అనంతరం సెప్టెంబరు 1న విధుల్లో చేరాల్సి ఉంటుందని డీఆర్‌డీఏ పీడీ సలీమ్‌బాషా తెలిపారు.

గురుకుల టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్): కర్నూలు/నంద్యాల జిల్లాల్లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో తాత్కాలిక పద్ధతిన టీచర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఎస్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జేఎల్ 05 (మ్యాథ్స్ -2, ఫిజిక్స్ -2, హిస్టరీ -1), పీజీటీ 01 (మ్యాథ్స్ -1), టీజీటీ 03 (బయో సైన్స్ -01, ఫిజికల్ సైన్స్ -01, టీజీటీ మ్యాథ్స్ 01) ఖాళీలు ఉన్నాయన్నారు. దరఖాస్తుదారులు తప్పనిసరిగా పీజీ, బీఎడ్‌లో కనీసం ద్వితీయ శ్రేణి ఉత్తీర్ణత, టెట్‌లో అర్హత కలిగి ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను జిల్లా కోఆర్డినేటర్ కార్యాలయంలో ఈ నెల 30వ తేదిలోగా అందించాలన్నారు. వివరాలకు 08518-295601 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 5,760 పింఛన్ల కోత

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్‌టీఆర్ పెన్షన్ కానుక కింద సెప్టెంబర్ నెలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో 4,61,629 పింఛన్లకు రూ.195.83 కోట్లు మంజూరయ్యాయి. ఈ ఏడాది జూన్ నెలతో పోలిస్తే 5,760 పింఛన్లు తగ్గిపోయాయి. ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా పింఛన్లలో కోత విధిస్తోంది. జూన్ మాసంలో 4,67,389 పింఛన్లు ఉండగా.. సెప్టెంబర్ నెలకు వచ్చే సరికి పింఛన్ల సంఖ్య 4,61,629 లకు తగ్గింది. అంటే ఏకంగా 5,760 పింఛన్ల కోత పడింది. కేవలం రెండు నెలల్లోనే పింఛన్లలో కోత పడటం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. యథావిధిగా పింఛన్లు రెండు రోజులు మాత్రమే పంపిణీ చేస్తారు.

ఐదు స్కూళ్లకు 'స్పోర్ట్స్' అవార్డు

కర్నూలు సిటీ: జిల్లాలో స్పోర్ట్స్ ఎక్సలెన్స్ స్కూల్ అవార్డుకు ఐదు పాఠశాలలు ఎంపిక అయ్యాయి. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం ఈ అవార్డులను కర్నూలు టౌన్ మోడల్ హైస్కూల్‌లో ప్రదానం చేయనున్నట్లు డీఈఓ కాగిత శామ్యూల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ హైస్కూల్ (మిలటరీ కాలనీ), మాచాని సోమప్ప జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల(ఎమ్మిగనూరు), జెడ్పీ హైస్కూల్ బాలురు(కోసిగి), ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలురు(బీక్యాంపు కర్నూలు), జెడ్పీ హైస్కూల్(మిడివేముల, ఓర్వకల్లు మండలం), కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం(కృష్ణగిరి), జెడ్పీహైస్కూల్(నందవరం), ఏపీ మోడల్ స్కూల్(ఆస్పరి)లు అవార్డులకు ఎంపికైనట్లు డీఈఓ పేర్కొన్నారు.

మద్దిలేటిస్వామి హుండీ ఆదాయం లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండలంలోని ఆర్‌ఎస్ రంగాపురం శివారులో వెలసిన శ్రీ మద్దిలేటి నరసింహస్వామికి భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. దేవదాయశాఖ అధికారి బ్రహ్మానందరెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. 29 రోజులకు సంబంధించి రూ. 18,26,371 నగదు, 20 గ్రాముల బంగారు, 940 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు.

పనిభారం తగ్గించాలి



ప్రభుత్వ ఆసుపత్రిలో పీజీలపై పనిభారం ఎక్కువగా ఉంది. పనిభారం తగ్గితే వారు చదువుకునేందుకు అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం ఆసుపత్రిలో పీజీలకు వసతులు, సౌకర్యాలు ఫరవాలేదు. అయితే అవి ఇంకా మెరుగుపడాల్సి ఉంది. గతంలో కొన్ని సమస్యలు ఉండేవి. ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో చర్చించి పరిష్కరించుకున్నాం. సెక్యూరిటీ మరింత పెరగాలి. గైనిక్ విభాగంలో రోగుల సహాయకుల తాకిడి ఎక్కువ. వారించడం చాలా కష్టంగా ఉంటోంది. రోగికి సీరియస్ అయి ఏదైనా జరిగితే గొడవలకు దిగుతున్నారు. ఈ విషయాన్ని అధికారులతో చర్చించగా త్వరలో సమస్యకు పరిష్కారం చూపుతామని చెప్పారు.

–డాక్టర్ శ్రీలక్ష్మి, హెచ్‌వోడీ, గైనకాలజీ, జీజీహెచ్, కర్నూలు



మహిళా డాక్టర్లకు కనీస భద్రత లేదు



తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికీ డాక్టర్లంటే కేవలం మగవారు మాత్రమే ఉంటారన్న ధోరణి కనిపిస్తోంది. ఆ విధంగానే అధికారులు సైతం ఆసుపత్రులలో వసతులు కల్పిస్తున్నారు. మహిళా డాక్టర్లకు ఎలాంటి వసతులు, సౌకర్యాలు ఉండటం లేదు. నర్సుల రూమ్‌లనే మహిళా డాక్టర్లు ఇప్పటికీ ఉపయోగించుకునే పరిస్థితి ఉంది. 1993 నుంచి నేను చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాను. భయం, భయంగా ఉద్యోగం చేసిన రోజులున్నాయి. మహిళా డాక్టర్లకు కనీస భద్రత ఉండటం లేదు. కొందరు ప్రొఫెసర్లు సైతం మహిళా డాక్టర్ల పట్ల వివక్ష చూపుతున్నారు. మనుషుల్లో విలువలు లేనప్పుడు చట్టాలనైనా కఠినంగా రూపొందించి అమలు చేయాల్సిన అవసరం ఉంది.

–డాక్టర్ ఎం. మంజులాబాయి, హెచ్‌వోడీ, ప్లాస్టిక్ సర్జరీ, జీజీహెచ్, కర్నూలు

ఎరువు.. అ'ధన'పు బరువు

- లింక్ పేరుతో ఎరువుల అమ్మకాలు
- రైతులను దోపిడీ చేస్తున్న ప్రైవేట్ డీలర్లు
- పట్టించుకోని వ్యవసాయశాఖ అధికారులు
- పొంచి ఉన్న ఎరువుల కొరత
- ఆగస్టు నెల వరకు రావాల్సిన ఎరువులు 1,21,990 టన్నులు
- వచ్చినవి 86,984 టన్నులు మాత్రమే



లింక్ పెడుతున్న వాటిలో ప్రధానమైన ఉత్పత్తులు ఇవే

కర్నూలు(అగ్రికల్చర్): సాధారణంగా మార్కెట్లలో ఒకటి కొంటే మరొకటి ఉచితం అంటూ ప్రచారం చేస్తుంటారు. తమ సరుకు అమ్ముకోవడానికి వ్యాపారులు ఈ వ్యూహాన్ని అమలు చేస్తుంటారు. అయితే ఎరువుల వ్యాపారులు ఒకడుగు ముందుకు వేసి ఒక ఎరువు కొంటే..ఇంకోటి తప్పనిసరిగా కొనాలనే నిబంధన విధిస్తున్నారు. అవసరం లేకున్నా వాటిని తీసుకోవడం రైతుకు అదనపు భారంగా మారింది. జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ, వెల్దుర్తి, ఆస్పరి, కౌతాళం, హాలహర్వి, గూడూరు, గోనెగండ్లలో రసాయన ఎరువుల దుకాణాలు ఎక్కువగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ నుంచి లైసెన్స్ పొందిన రీటైల్ డీలర్లు 734 మంది ఉన్నారు. వీరికి అదనంగా హోల్‌సేల్ డీలర్లు 24 మంది ఉన్నారు. ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ, వెల్దుర్తి, కర్నూలు, కల్లూరు, ఆలూరు, దేవనకొండ, సి. బెళగల్, గూడూరు తదితర ప్రాంతాల్లో రసాయన ఎరువుల కొనుగోలుకు ఇతర ఉత్పత్తులు లింక్ పెడుతున్నారు. డీఏపీ, యూరియా, కాంప్లెక్స్ ఎరువులు కొనాలని పోతే...అవసరం లేని వాటిని గ్రోత్ ప్రమోటర్స్ పేరుతో లింక్ పెట్టి అమ్ముతున్నారు.

దోపిడీ ఇలా..

కోరమాండల్ కంపెనీకి చెందిన ఎరువులు కావాలంటే ఎస్‌వీఆర్ కంపెనీకి చెందిన సీఎంఎస్, ఎన్‌పీకే 15-15-15, ఎన్‌పీకే 10-26,26, ఎన్‌పీకే 22-00-11, ఎన్‌పీకే 14-35-14, ఎన్‌పీకే 17-17-17, ఎన్‌పీకే 20-20-00-13, ఎన్‌పీకే 20-20-00, ఎన్‌పీకే 19-19-19 వంటి వాటిని కొనాలని చెబుతున్నారు. డీఏపీ 50 కిలోల బస్తా రూ.1,350 ప్రకారం అమ్ముతున్నారు. ఇతర ఉత్పత్తులు కొంటే ఈ ధరతో ఇస్తున్నారు. లింక్ వద్దంటే డీఏపీ బస్తా ధర రూ.1,400 అపై వరకు ఉంటుంది. కొంతమంది డీలర్లు బయోలు లింక్ పెడుతున్నారు. మరికొందరు లిక్విడ్ మందులు రైతులకు అంటగడుతున్నారు. మొత్తంగా ఇతర ఉత్పత్తులు తీసుకుంటేనే ఎరువులు ఇస్తామనే షరతు విధిస్తున్నారు.

ఆర్‌బీకేలు నిర్వీర్యం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాల ద్వారా గ్రామ స్థాయిలో అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచేది. కచ్చితమైన ధరలకు ఎలాంటి లింక్‌లు లేకుండా ఎరువులు లభించేవి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామ స్థాయిలో రైతులకు సేవలు అందించే రైతుభరోసా కేంద్రాలు నిర్వీర్యం అయ్యాయి. వీటిని రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేశారే తప్ప ఎలాంటి సేవలు అందించడం లేదు. ఈ కేంద్రాల్లో ఎరువులు లభించని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు ప్రైవేటు డీలర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. అవి కావాలంటే ఇవి కూడా తీసుకోవాల్సిందేనని వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

మామూళ్ల బంధం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుభరోసా కేంద్రాలు చురుగ్గా పనిచేయడంతో ప్రైవేటు డీలర్ల అక్రమాలు తగ్గిపోయాయి. గ్రామస్థాయిలోనే ఎరువులు లభిస్తుండటంతో ప్రైవేటు డీలర్లు కూడా ఎలాంటి లింక్ లేకుండా... అధిక ధరలు లేకుండా ఎంఆర్‌పీకే అమ్ముకునే వారు. అధికార మార్పిడి జరుగడంతో ప్రైవేటు డీలర్ల అక్రమాలకు గేట్లు ఎత్తినట్లు అయింది. అక్రమాలను నివారించాల్సిన వ్యవసాయ అధికారులు మామూళ్ల బంధం కారణంగా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి.

అరకొర సరఫరా..

జిల్లాకు రసాయన ఎరువులు అంతంతమాత్రంగానే వస్తున్నాయి. ఏప్రిల్ నెల నుంచి ఆగస్టు వరకు 1,21,990 టన్నులు రావాల్సి ఉంది. కాని ఇప్పటి వరకు 86,986 టన్నులు మాత్రమే వచ్చాయి. దీన్ని బట్టి చూస్తే జిల్లాకు ఎరువులు అరకొర సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది.

సరిహద్దులు దాటుతున్న ఎరువులు..

జిల్లాలో 24 మంది హోల్‌సేల్ డీలర్లు ఉన్నారు. వీరికి ప్రత్యేకంగా షాపులు అంటూ ఉండవు. కేవలం ఆఫీసు మాత్రమే ఉంటుంది. జిల్లాకు ర్యాక్‌లు వచ్చినప్పుడు వాటిని హోల్‌సేల్ డీలర్లకు కేటాయిస్తారు. వీటిని రీటైల్ డీలర్లకు ఇవ్వాల్సి ఉంటుంది. హోల్‌సేల్ డీలర్లకు కేటాయిస్తున్న ఎరువులు జిల్లా పరిధిలోనే రీటైల్ డీలర్లకు వెళ్తున్నాయా.. అనే దానిని ఎవరూ పట్టించుకోవడం లేదు. దీనిని అవకాశంగా తీసుకొని ఎరువులను జిల్లా సరిహద్దులు దాటిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి.

ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు జిల్లాకు రావాల్సిన ఎరువులు, వచ్చిన ఎరువుల వివరాలు.. (టన్నుల్లో)

నెల	రావాల్సిన ఎరువులు	వచ్చినవి
ఏప్రిల్	10,245	7,201
మే	20,185	6,230
జూన్	19,975	23,895
జూలై	30,150	33,266
ఆగస్టు	41,435	16,392
మొత్తం	1,21,990	86,984

చర్యలు తీసుకుంటాం



రసాయన ఎరువుల అమ్మకాలకు ఎలాంటి లింక్ పెట్టరాదు. అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. జిల్లాలో ఎరువుల పంపిణీ సాఫీగా జరుగుతోంది. రైతుల నుంచి ఫిర్యాదులు కూడా లేవు. ప్రస్తుతానికి జిల్లాలో ఎరువుల కొరత లేదు. రానున్న రోజుల్లో కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. – పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు

వచ్చే నెల 15న వినాయక నిమజ్జనోత్సవం

- పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నవ్య

కర్నూలు(సెంట్రల్): నగరంలో సెప్టెంబర్ 15న వినాయక నిమజ్జనోత్సవం నిర్వహించనున్నారని, అందుకు పకడ్బందీ ఏర్పాట్లను చేపట్టాలని అధికారులను జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో గణేశ్ మహోత్సవాలపై బుధవారం వివిధ శాఖల అధికారులు, గణేశ్ కేంద్ర కమిటీ సభ్యులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..సెప్టెంబర్ 7న వినాయక విగ్రహాలు జిల్లా అంతటా కొలువుదీరుతాయన్నారు. కర్నూలులో జరిగే నిమజ్జనోత్సవానికి ఎనిమిది క్రేన్లను ఏర్పాటు చేయడంతోపాటు డ్రైవర్లు, మెకానిక్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. కేసీ కెనాల్‌లోని అన్ని ఘాట్ల వద్ద బోట్లు, లైఫ్ జాకెట్లతో గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. ఘాట్ల సమీపంలో అంబులెన్స్‌లు, మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. చికెన్ గున్యా, డెంగీ వ్యాధులు నమోదవుతున్న తరుణంలో పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి విగ్రహానికి అనుమతి తీసుకోవాలని, ఒక నంబర్ ఇస్తామని, దాని ప్రకారం నిమజ్జనానికి వినాయకులను అనుమతిస్తామన్నారు. విగ్రహాల దగ్గర సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో కె.మధుసూదన్‌రావు, కర్నూలు, పత్తికొండ, ఆదోని ఆర్డీఓలు ఎం.శేషిరెడ్డి, రామలక్ష్మి, విశ్వనాథ్, గణేశ్ కేంద్ర కమిటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వర్, జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి, నాయకులు సుధాకర్, జనార్దన్ పాల్గొన్నారు.

నకిలీ ఫోన్‌పేతో బురిడీ

- రూ.17 వేలకు బంగారు కమ్మలు కొనుగోలు
- నకిలీ ఫోన్‌పేతో నగదు చెల్లింపు
- ఖాతాలో నగదు జమ కాకపోవడంతో బయట పడిన మోసం



బంగారు కమ్మలు కొనుగోలు చేస్తున్నట్లు సీసీ కెమెరాలో నమోదైన ఫుటేజీ

కోవెలకుంట్ల: నకిలీ ఫోన్‌పేతో బంగారు వ్యాపారిని బురిడీ కొట్టించి బంగారు కమ్మలు తీసుకెళ్లిన సంఘటన బుధవారం కోవెలకుంట్ల పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం మేరకు.. స్థానిక ఎస్‌ఎల్‌వీ సినిమా థియేటర్ ఎదురుగా ఉన్న లక్ష్మీ జ్యువెలర్స్ బంగారు దుకాణానికి గుర్తు తెలియని ఒక మహిళతోపాటు మరో వ్యక్తి బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేందుకు వచ్చారు. ఒక జత బంగారు కమ్మలను రూ. 17 వేలకు బేరం కుదుర్చుకుని ఇందుకు సంబంధించిన మొత్తాన్ని ఫోన్‌పే ద్వారా చెల్లించారు. ఫోన్‌పేలో నగదు బదిలీ అయినట్లు స్క్రీన్‌షాట్ చూపించడంతో యజమాని సుబ్బయ్య వారికి కమ్మలు ఇవ్వడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. తర్వాత ఫోన్‌పేలో నగదు చెక్ చేసుకోగా డబ్బులు జమ కాకపోవడంతో నకిలీ ఫోన్‌పేతో మోసం చేశారని భావించి లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు.

రయ్.. రయ్..!

- జిల్లాలో పెరిగిన వాహనాల వినియోగం
- ఒక్కో కుటుంబంలో.. ఒకటికి మించిన వాహనాలు
- రవాణా శాఖ ఖజానాకు భారీ ఆదాయం
- ఉమ్మడి జిల్లాలో మొత్తం వాహనాలు 15.50 లక్షలు
- అందులో 12.60 లక్షల ద్విచక్ర వాహనాలు



కర్నూలు: గతంలో పేదోడి వాహనం అనగానే సైకిల్ గుర్తొచ్చేది. ఇప్పుడు ద్విచక్ర వాహనం గుర్తొస్తుంది. ఈ రోజుల్లో ఏదో ఒక వాహనం లేని ఇల్లు కనిపించదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12.70 లక్షల కుటుంబాలు ఉండగా 15.50 లక్షలకు పైగా వాహనాలు ఉన్నాయి. వీటిలో 12.60 లక్షలకు పైగా ద్విచక్ర వాహనాలు ఉండటంవిశేషం. తర్వాత స్థానంలో కార్లు, వ్యవసాయ ట్రాక్టర్లు, ట్రాలీలు ఉన్నాయి. కారు, ట్రాక్టర్, ఇతర వాహనాలు ఉన్న ప్రతి ఇంట్లో ద్విచక్ర వాహనం తప్పనిసరిగా ఉంది. ఆర్థికంగా ఎలాంటి ఇబ్బంది లేనివారు సొంతంగా కార్లను కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వాహనాల సంఖ్య గత పదేళ్ల కాలంలో విపరీతంగా పెరిగింది. ఈ నేపథ్యంలో కుటుంబాల కంటే వాహనాలే ఎక్కువగా ఉన్నాయి.

80 శాతం ద్విచక్ర వాహనాలే....

ప్రజల అవసరాలకనుగుణంగా వాహనాల కొనుగోళ్లు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. ద్విచక్ర వాహనాల వినియోగం అధికంగా ఉంది. కుటుంబాలకు సమాన నిష్పత్తిలో ఉన్నాయి. ప్రతి ఒక్కరూ అవసరాలకు అనుగుణంగా ద్విచక్ర వాహనం, ఆర్థికంగా ఉన్నవారు కార్లు కొనుగోలు చేస్తున్నారు. ఒక ఇంట్లో ఐదుగురు వ్యక్తులు ఉంటే కనీసం రెండు, మూడు వాహనాలు తప్పనిసరిగా ఉంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో 80 శాతం ద్విచక్ర వాహనాలు తిరుగుతుండగా ఆ తర్వాతి స్థానం కార్లు, రైతులు వ్యవసాయం కోసం ఉపయోగించే వివిధ రకాల ట్రాక్టర్లది. ఆర్‌టీఏ కార్యాలయంలో ప్రతిరోజూ 50 నుంచి 100 దాకా ద్విచక్ర వాహనాలు, ఐదు నుంచి పది వరకు కార్లు, ట్రాక్టర్లు, 50కి పైగా ఇతర వాహనాలు రిజిస్ట్రేషన్ కోసం తరలి వస్తుంటాయి.

రవాణా శాఖకు భారీ ఆదాయం...

2014లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ ద్వారా రూ.50 కోట్ల ఆదాయం దాటకపోయేదని అధికారులు చెబుతున్నారు. కానీ ఇప్పుడు సుమారు రూ.400 కోట్లు ఆదాయం రవాణా శాఖకు వస్తోంది. వాహనాల క్రయ, విక్రయాలు పెరగడంతో ఆదాయం పెరిగింది. రవాణా శాఖ జీవిత పన్ను, త్రైమాసిక పన్ను, యూజర్ చార్జీలు వసూలు చేస్తోంది. వీటిలో లైఫ్ ట్యాక్స్ ద్వారా ఎక్కువగా ఆదాయం వస్తోంది.

విక్రయాలు భారీగా పెరుగుతున్నాయి



జిల్లాలో వాహనాల కొనుగోళ్లు భారీగా పెరిగాయి. ఎక్కువగా ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో కార్ల విక్రయాలు పెరిగే అవకాశం ఉంది. కరోనా తర్వాత వ్యక్తిగత వాహనాల వినియోగం బాగా పెరిగింది.

– శ్రీధర్, డీటీసీ

జిల్లా	వాహనాలు (2024)	వాహనాలు (2014)	కుటుంబాలు	రవాణా శాఖ ఆదాయం 2023-24 (రూ.లక్షల్లో)
కర్నూలు	8.50 లక్షలు	4,03,510	సుమారు 6.50 లక్షలు	రూ.250 కోట్లు
నంద్యాల	7.2 లక్షలు	3,75,038	6.20 లక్షలు	రూ.150 కోట్లు

కర్నూలు జిల్లాలో ఉన్న వాహనాల సంఖ్య...

ద్విచక్ర వాహనాలు	6,60,000
కార్లు	47,776
గూడ్స్ క్యారేజీలు	19,223
ట్రాక్టర్, ట్రాలీలు	21,721
మూడు చక్రాల గూడ్స్ వాహనాలు	5,188
ఆటో రిక్షాలు	38,324
అంబులెన్స్‌లు	278
కాంట్రాక్టు క్యారేజీలు	157
ఐడిల్ బస్సులు	64
ఆర్టిక్యులేటెడ్ వెహికల్స్	43
విద్యాసంస్థల బస్సులు	864
ఆల్ ఇండియా టూరిస్ట్ క్యాబ్‌లు	36
ట్యాక్సీ క్యాబ్‌లు	2530
మ్యాక్సీ క్యాబ్‌లు	865
ప్రైవేటు సర్వీస్ వాహనాలు	64
స్టేజీ క్యారేజెస్	1842
ఇతర వాహనాలు (రవాణా)	2,093
జీపులు	737
ప్రైవేటు ట్రాక్టర్లు	13,470
వ్యవసాయ ట్రైలర్లు	5,358
రోడ్డు రోలర్లు	54
రిగ్ మౌంటెడ్	79
కట్టడాల పరికరాలు	904
ఫైర్ టెండర్లు	91
ఇతర వాహనాలు (నాన్ ట్రాన్స్‌పోర్ట్)	610

మహత్కార్యానికి వేళాయే!

- నేడు శ్రీశైలంలో స్వర్ణరథంపై ఆది దంపతుల విహారం
- ఇక నుంచి ప్రతినెలా ఆరుద్ర నక్షత్రం రోజున నిర్వహణ
- ఇప్పటికే ట్రయిల్ రన్ పూర్తిచేసిన దేవస్థానం

శ్రీశైలం టెంపుల్: ఇలకైలాసమైన శ్రీశైల మహాక్షేత్రంలో మొట్టమొదటి సారిగా ఆది దంపతులు స్వర్ణ రథంపై విహరించనున్నారు. ఈ మహత్కార్యం గురువారం జరుగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను దేవస్థానం అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం ఉదయం ఆలయ మాడవీధుల్లో స్వర్ణ రథోత్సవం నిర్వహిస్తారు. వేకువజామున స్వామివారికి మహాన్యాసపూర్వక ఏకా దశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు చేస్తారు. అనంతరం 7.30 గంటలకు ఆలయ మాడవీధుల్లో స్వర్ణ రథంపై ఊరేగిస్తారు. తొలిసారిగా జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇకపై ప్రతి నెలా ఆరుద్ర నక్షత్రం రోజున స్వామి అమ్మవార్లకు స్వర్ణరథోత్సం నిర్వహించాలని దేవస్థానం అధికారులు నిర్ణయించారు.

పూర్తయిన ట్రయల్ రన్

ఈ ఏడాది ఫిబ్రవరి 16న స్వర్ణరథానికి సంప్రోక్షణ, ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాలు జరిపించారు. అనంతరం ఆలయ రాజగోపురం నుంచి నంది మండపం వరకు తిరిగి నంది మండపం నుంచి ఆలయ రాజగోపురం వరకు స్వామిఅమ్మవార్ల స్వర్ణ రథోత్సవం నిర్వహించారు. అనంతరం గత నెలలో ఆలయ మాడవీధుల్లో ట్రయిల్ రన్ నిర్వహించారు. అన్ని మాడవీధుల్లో ఎటువంటి అడ్డంకులు లేకుండా స్వర్ణ రథం తిరిగేలా విద్యుత్ వైర్లు తొలగించారు. అలాగే భద్రతాపరంగా తీసుకోవాల్సిన చర్యలపై కూడా ట్రయిల్‌రన్ నిర్వహించారు.



ఆలయం ఎదురుగా స్వర్ణ రథంపై విహరిస్తున్న ఆదిదంపతులు(ఫైల్)

క్లుప్తంగా

కుక్కను వెంబడించబోయి వ్యక్తి మృతి


మృతుడు బోయ చంద్ర (ఫైల్)

దేవనకొండ: కుక్కను వెంబడించబోయి గుండెపోటుతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని నేలతలమరి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బోయ చంద్ర తన ఇంటి పరిసరాల్లో కోళ్లు, పొట్టేళ్లను పెంచుతున్నాడు. రెండు రోజుల నుంచి పిచ్చికుక్క కోళ్లను చంపుతోంది. మంగళవారం రాత్రి మరోసారి కోళ్లను చంపడానికి రావడంతో కర్రతో వెంబడించాడు. కుక్క తమ మీదికి దాడికి రావడంతో తిరిగి పరిగెత్తుతూ.. గుండె కొట్టుకోవడం ఆగి వెంటనే కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో దేవనకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడికి భార్య బోయ సుజాత, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అత్యాచార నిందితుల అరెస్టు


పోలీసుల అదుపులో ఉన్న అత్యాచార కేసు నిందితులు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలో మానసిక స్థితి సరిగా లేని 16 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను బుధవారం అరెస్ట్ చేసినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అత్యాచార సంఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పట్టణంలోని శ్రీరాం నగర్ కాలనీకి చెందిన వెంకటేష్ నాయక్ కుమారుడు సుగాలి సంతోష్ నాయక్, ఆంజనేయులు కుమారుడు మగత అజయ్, సుధాకర్ కుమారుడు పాలిమైన సుభాష్ అనే యువకుల్లో ఒకరు మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడగా మరో ఇద్దరు యువకులు లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీస్ విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు ఆ ముగ్గురు యువకులపై పోక్సో, అత్యాచారం, లైంగిక దాడి సెక్షన్ల కింద కేసు నమోదు చేసి వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరుచగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ హనుమంతునాయక్, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

స్పందించిన నేషనల్ హైవే అధికారులు


స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక ర్యాంపు

సాక్షి ఎఫెక్ట్

జూపాడుబంగ్లా: మండ్లెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సమస్యపై అధికారులు స్పందించారు. స్కూల్‌కు వెళ్లేందుకు సరైన దారి లేక వారు పడుతున్న ఇబ్బందిపై 'మడుగుదాటనిదే బడికి చేరలేరు' శీర్షికన బుధవారం సాక్షి కథనం ప్రచురించింది. దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నేషనల్‌హైవే 340సీ అధికారులు వెంటనే పాఠశాల విద్యార్థులు వెళ్లేందుకు తాత్కాలికంగా రోడ్డును ఏర్పాటు చేశారు. పాఠశాల ఎదుట నేషనల్‌హైవే నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసిన లోలెవెల్ అండర్‌టన్నెల్ వంతెన కింద వర్షపు నీరు చేరి విద్యార్థుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. దీనిపై విద్యార్థులు, గ్రామస్తుల ఆందోళనతో జిల్లా కలెక్టర్ రాజకుమారి స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.


కల్వర్టు వద్ద సుద్దబిలుకుతో వేసిన ర్యాంపు

పోలీస్ ప్రొటెక్షన్ పెంచాలి



ప్రభుత్వ వైద్యశాలల్లో పోలీస్ ప్రొటెక్షన్ పెంచాలి. అప్పుడే వైద్య సిబ్బంది నిర్భయంగా విధులను నిర్వర్తించుకునే వీలుంటుంది. కోల్‌కతా లాంటి ఘటన దేశంలో మరెక్కడా చోటు చేసుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలి. ఆసుపత్రుల్లో మహిళా వైద్య సిబ్బందికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి. - డాక్టర్ తస్లీమా, అర్బన్ హెల్త్ సెంటర్-1, బేతంచెర్ల



కఠిన చర్యలు తీసుకోవాలి

వైద్యుడు దేవుడితో సమానం అంటారు. అటువంటి వారిపై అమానుషంగా ప్రవర్తించే వారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. వైద్యులను హత్య చేయడం చాలా దారుణం. ఆసుపత్రి ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. మహిళా డాక్టర్లు విధులు నిర్వహించే ఆసుపత్రుల వద్ద పటిష్టమైన భద్రత కల్పించాలి.- డాక్టర్ లక్ష్మి ప్రియాంక, అర్బన్ హెల్త్ సెంటర్-2 , బేతంచెర్ల



రక్షణ కల్పించాలి

కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఉదంతం తీవ్రంగా కలచివేసింది. ఇలాంటి ఘటనలు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాలి. నేరస్తులకు కఠినశిక్షలు అమలు చేయాలి. ఆసుపత్రుల్లో ఎంతో మంది మహిళా వైద్యులు ఒంటరిగానే విధులకు వస్తూ ఉంటారు. వారికి తప్పని సరిగా రక్షణ ఉండాలి.- డాక్టర్ హరీష్, చిన్నపిల్లల వైద్యుడు, ఆదోని



'పుట్టి'డు కష్టాలు

- బళ్లారికి వెళ్లాలంటే వేదావతి నది దాటక తప్పదు
- ప్రమాదకర స్థాయిలో పుట్టి ప్రయాణం
- నదిపై బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్న ప్రజలు

హాలహర్వి: ఉన్నత పాఠశాలకు వెళ్లాలన్నా.. ఇష్టదైవాన్ని దర్శించుకోవాలన్నా.. ఆసుపత్రిలో వైద్యం పొందాలన్నా.. ప్రాణాలు అరచేతిలో పట్టుకుని వారంతా పుట్టిలో ప్రయాణించాల్సిందే. వేదావతి(హగరి) నదీ తీర ప్రాంత ప్రజల దుస్థితి ఇది. హాలహర్వి మండలం గూళ్యం, హొసళ్లి, అమృతాపురం, సిద్ధాపురం, బల్లూరు, నిట్రవట్టి, పచ్చారపల్లి, బాపురం తదితర గ్రామాల ప్రజలు ఏ చిన్న అవసరమొచ్చినా వేదావతి(హగిరి) నదిని దాటుకుని బళ్లారి వెళ్లాల్సి వస్తోంది. ఆయా గ్రామాల నుంచి జిల్లా కేంద్రమైన కర్నూలుకు చేరుకోవాలంటే 170 కి.మీ. దూరం అవుతుంది. అయితే ఈ గ్రామాలకు 35 కి.మీ. దూరంలోనే కర్ణాటకలోని జిల్లా కేంద్రమైన బళ్లారి ఉంది. దీంతో ఈ ప్రాంత ప్రజలు బళ్లారిపైనే ఆధారపడ్డారు. కన్నడ మీడియంలో ప్రాథమిక విద్య పూర్తి చేసిన విద్యార్థులు సైతం బళ్లారికి వెళ్తున్నారు. బళ్లారికి వెళ్లాలంటే వేదావతి నదిని దాటాల్సి వస్తోంది. నదిపై వంతెన లేకపోవడంతో విద్యార్థులు, ప్రజలు పుట్టిల్లో ప్రయాణిస్తున్నారు.

భారీ వర్షం వస్తే అంతే..

గూళ్యం గ్రామ సమీపంలో వేదావతి(హగిరి) నది ప్రవహిస్తోంది. భారీ వర్షం వస్తే నది ఉధృతంగా ప్రవహిస్తుంది. అటువైపు, ఇటువైపు ఉన్న గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. మండల కేంద్రమైన హాలహర్వికి చేరుకోవాలన్నా, పొలం పనులకు వెళ్లాలన్నా నది దాటాల్సిన పరిస్థితి నెలకొంది. పోటెత్తిన నదిలో కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో చిన్న పుట్టి సాయంతో నదిపై ఒడ్డు చేరుకుంటున్నారు. ఆ పుట్టి అదుపు తప్పితే ప్రాణాలు గాల్లో కలిసినట్లేనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వేదావతి నదికి సమీపంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన గూళ్యం గాదిలింగేశ్వరస్వామి ఆలయం ఉంది. దర్శించుకోవడానికి ప్రతి గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వరద ఉధృతి తక్కువగా ఉన్న సమయంలో నదిలో నడుచుకుంటూ వస్తారు. నీటి ఉధృతి ఎక్కువైతే పుట్టిలో ప్రయాణం సాగిస్తారు. కర్ణాటక, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి నదిపై వంతెన నిర్మాణం చేపట్టి రవాణా సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


వేదావతి నదిలో పుట్టిలో ప్రయాణిస్తున్న ప్రజలు

వంతెన నిర్మాణం ఎప్పుడో?



నా వయస్సు 75 సంవత్సరాలు. నా చిన్నపటి నుంచి వేదావతి నదిలో నడుచుకుంటూ బళ్లారికి వెళ్తున్నాం. ప్రమాదమని తెలిసినా తప్పని పరిస్థితుల్లో వెళ్తున్నాం. రాజకీయ నాయకులు నదిపై వంతెన నిర్మాణం చేపడతామని చెబుతున్నారే గానీ చేయడం లేదు. వంతెన నిర్మిస్తే మా కష్టాలు తీరుతాయి. - మల్లయ్య, గూళ్యం గ్రామం

ప్రజల ఇబ్బందులను గుర్తించాలి



మేం బళ్లారికి వివిధ పనుల నిమిత్తం వెళ్లి వస్తుంటాం. గూళ్యం సమీపంలోని వేదావతి నదిలో ప్రయాణం చేయాలంటే భయంగా ఉంది. కానీ తప్పని పరిస్థితుల్లో పుట్టి ప్రయాణం చేస్తూ ఒడ్డు చేరుకుంటున్నాం. ప్రభుత్వాలు ప్రజల ఇబ్బందులను గుర్తించాలి. వంతెన నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలి. - ఎర్రిస్వామి, హొసళ్లి గ్రామం

ప్రభుత్వాలు స్పందించాలి



వేదావతి నది సమీపంలో గూళ్యం గాదిలింగేశ్వరస్వామి, అమృతాపురం టోపీ మారెమ్మవ్వ, దిబ్బల సోమప్ప ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయాలకు నిత్యం వందల సంఖ్యలో భక్తులు వచ్చి వెళ్తుంటారు. నది దాటుకుని ఆలయాలకు వచ్చే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి. - పాండు, గూళ్యం గ్రామం

బీమా సొమ్ము వడ్డీతో సహా చెల్లించాల్సిందే!

- హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ సంస్థకు వినియోగదారుల కమిషన్ ఆదేశం

కర్నూలు (లీగల్): బీమా సొమ్ము వడ్డీతో సహా చెల్లించాల్సిందేనని హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ సంస్థను జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు కమిషన్ అధ్యక్షులు కె.కిషోర్‌కుమార్, సభ్యులు ఎస్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్‌లతో కూడిన బెంచ్ బుధవారం తీర్పునిచ్చింది. వివరాలు ఇవీ.. ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ గ్రామానికి చెందిన కె.శ్రీనివాసులు నాయుడు 2021 జూన్‌లో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ సంస్థ నుంచి రూ.18.78 లక్షలకు బీమా పాలసీ తీసుకున్నారు. ఇందుకు రూ.98 వేలు ప్రీమియంగా చెల్లించారు. 2022 సెప్టెంబర్‌లో గుండెపోటుతో శ్రీనివాసులు నాయుడు చనిపోయారు. బీమా సొమ్ము కోసం శ్రీనివాసులు నాయుడు భార్య దరఖాస్తు చేసుకోగా 2021 డిసెంబర్‌లో శ్రీనివాసులు నాయుడు ఓమ్నీ ఆసుపత్రిలో చికిత్స పొందారని, ఆయనకు గుండె సంబంధమైన వ్యాధి ఉన్న విషయాన్ని దాచి పాలసీ తీసుకున్నారంటూ హెచ్‌డీఈఎఫ్‌సీ లైఫ్ బీమా సొమ్ము ఇచ్చేందుకు నిరాకరించింది. అయితే హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్‌లోనే 2018లో రూ.15 లక్షలకు శ్రీనివాసులు నాయుడు జీవిత బీమా పాలసీ తీసుకున్నారని, ఆ పాలసీ మొత్తాన్ని ఇచ్చారని శ్రీనివాసులు నాయుడు భార్య భూలక్ష్మి దేవి కమిషన్‌ను ఆశ్రయించారు. రోగాలను దాచి జీవిత బీమా పాలసీ తీసుకున్నారనేందుకు హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఎటువంటి ఆధారాలను చూపలేదు. ఈ నేపథ్యంలో పిటిషనర్‌కు రూ.18.78 లక్షలు వడ్డీతో సహా చెల్లించాలని కమిషన్ ఆదేశించింది. అలాగే పరిహారం, కోర్టు ఖర్చులకు రూ.30 వేలు చెల్లించాలని తీర్పులో పేర్కొంది.

జాతీయ జెండాకు అవమానం

- టీడీపీ నాయకుడు, సినీ నిర్మాత ఇంటిపై తలకిందులుగా జాతీయ జెండా ఎగురవేత


జాతీయ జెండాను తలకిందులుగా ఎగురవేసిన దృశ్యం

డోన్: తెలుగుదేశం పార్టీ నాయకుడు, సినీ నిర్మాత మలిచెట్ల మహేష్‌ఖన్నా గౌడ్ తన ఇంటిపై జాతీయ జెండాను తలకిందులుగా ఎగురవేసి అవమానపరిచారు. ప్రధాని నరేంద్రమోదీ ఆగస్టు 15వ తేదీన ప్రతి ఇంటిపై జాతీయజెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. దీంతో ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై త్రివర్ణ పతకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుకున్నారు. ఈ కోవలోనే నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి చెందిన సత్యాగ్యాంగ్ సినీ నిర్మాత, టీడీపీ నాయకుడు తన ఇంటిపై జాతీయ జెండాను తలకిందులుగా ఎగురవేయడమే కాక నేటికీ అలాగే ఉంచాడు. ఈ దృశ్యాన్ని చూసిన పలువురు దేశభక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ అతనిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రూ.3లక్షల్లోపు ఆదాయం ఉంటే ఉచిత న్యాయ సహాయం


మాట్లాడుతున్న లీలా వెంకటశేషాద్రి

కర్నూలు(లీగల్): సంవత్సర ఆదాయం రూ.3 లక్షల్లోపు ఉండే ప్రతి ఒక్కరూ ఉచిత న్యాయ సహాయానికి అర్హులని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి తెలిపారు. బుధవారం జిల్లా న్యాయ సేవా సదన్‌లో అంగన్‌వాడీ వర్కర్లు, దుకాణాలు, సంస్థల కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలతో రాత్రి 7 గంటల వరకు మాత్రమే పని చేయించాలన్నారు. కార్మికులకు ప్రతి నెలా 7లోపు వేతనాలు చెల్లించాలన్నారు. ప్రతి కార్మికుడు కేవైసీ చేయించుకోవడంతో పాటు ఈశ్రమ్‌కార్డు తీసుకోవాలన్నారు. కార్డు పొందిన వారు ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.2లక్షల సాయం పొందేందుకు అర్హులన్నారు. పీఎం సిమ్ పెన్షన్‌కు 18 నుంచి 40 సంవత్సరాల్లోపు కార్మికులు మీసేవలో నమోదు చేసుకోవాలన్నారు. అనాథ పిల్లలు, తల్లి వితంతువు లేదా విడాకులు తీసుకున్నా లేదా కుటుంబం విడిచిపెట్టిన పిల్లలు, తల్లిదండ్రులు అసమర్థులైన పిల్లలకు స్పాన్సర్‌షిప్ వర్తింపునకు ప్రాధాన్యత ఇవ్వాలని స్త్రీ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో సీడీపీఓ అసిస్టెంట్ కమిషనర్ సాంబశివ రావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్లు శారద, జుబేదా బేగం తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు కౌన్సెలింగ్

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ఈ నెల 29న కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. గ్రేడ్-5, గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శులకు స్థానిక జిల్లా పరిషత్ ప్రాంగణంలోని సమావేశ భవనంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బదిలీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. అలాగే వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు కూడా జెడ్పీ సమావేశ భవనంలోనే కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

ఉద్యోగులు	కౌన్సెలింగ్ ప్రాంతం
ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు	జెడ్పీ ప్రాంగణంలోని పీఆర్ ఎస్ఈ కార్యాలయం
సర్వే అసిస్టెంట్‌లు	కలెక్టరేట్‌లోని ఏడీ సర్వే కార్యాలయం
వీఆర్‌ఓ, వార్డు రెవెన్యూ సెక్రెటరీలు	కలెక్టరేట్‌లోని డీఆర్‌ఓ కార్యాలయం
మహిళా పోలీసు, చైల్డ్ వెల్ఫేర్ అసిస్టెంట్, వార్డు ఉమెన్ అండ్ వీకర్ సెక్షన్స్ ప్రొటెక్షన్ సెక్రెటరీలు	జిల్లా ఎస్పీ కార్యాలయం
ఏఎన్ఎం అండ్ వార్డు హెల్త్ సెక్రెటరీలు	డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం
హార్టికల్చర్ అసిస్టెంట్‌లు	కలెక్టరేట్‌లోని ఏపీఎంఐపీ పీడీ కార్యాలయం
ఎనర్జీ అసిస్టెంట్‌లు	విద్యుత్ భవన్ ఎస్ఈ డిస్కం కార్యాలయం
వెటర్నరీ అసిస్టెంట్‌లు	అనిమల్ హస్బెండరీ జేడీ కార్యాలయం
అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు	వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయం

శ్రీశైల పవిత్రత పరిరక్షణకు చర్యలు


శ్రీశైల దేవస్థాన అధికారులు, సిబ్బందితో సమీక్షిస్తున్న ఈఓ పెద్దిరాజు

- స్వర్ణ రథోత్సవం, సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు పకడ్బందీ ఏర్పాట్లు
- పాలనాంశాలపై సమీక్షలో దేవస్థానం ఈఓ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహాక్షేత్రం పవిత్రతను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు అన్నారు. వివిధ పాలనాంశాలకు సంబంధించిన విషయాలపై అధికారులు, పర్యవేక్షకులు, ప్రధానార్చకులు, వేదపండితులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు జరిగే స్వర్ణ రథోత్సవానికి, శుక్రవారం నిర్వహించే సామూహిక వరలక్ష్మి వ్రతానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. వరలక్ష్మీ వ్రతంలో గిరిజన చెంచు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని ఆలయ, ప్రజాసంబంధాల విభాగాల అధికారులను ఆదేశించారు.

భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

క్షేత్రాన్ని ప్రతిరోజు వేలాదిమంది భక్తులు దర్శించుకునేందుకు వస్తుంటారని, ఈనేపథ్యంలో క్షేత్ర భద్రత ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందిని ఈఓ ఆదేశించారు. ఆలయ పరిధిలో రాష్ట్ర దేవదాయ ధర్మదాయ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. నిషేధితమైన ధూమపానం, మత్తుకు సంబంధించి వస్తువులను అనుమతించకుండా టోల్‌గేట్ వద్ద తనిఖీలు చేపట్టాలన్నారు. వినాయక చవితి పర్వదినం తర్వాత మూడో రోజు నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కృష్ణా నదిలో వినాయక నిమజ్జనానికి వస్తారన్నారు. ఆ సమయంలో భక్తుల రద్దీకి తగ్గట్టు ఏర్పాట్లతో పాటు దర్శన వేళలు కల్పించాలన్నారు. అదనంగా ప్రసాదాల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రసాదాల విక్రయ విభాగాన్ని ఆదేశించారు.

ప్రియురాలికి మరొకరితో నిశ్చితార్థం

- మనస్థాపంతో ప్రియుడు ఆత్మహత్య

కర్నూలు: ప్రేమించిన యువతిని కుటుంబ సభ్యులు మరొకరికి ఇచ్చి వివాహం జరిపించేందుకు నిశ్చితార్థం చేశారనే సమాచారం తెలుసుకున్న ప్రియుడు తెలుగు అశోక్(25) కర్నూలు కొత్తబస్టాండ్ సమీపంలోని ఓ లాడ్జిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తెలంగాణ రాష్ట్రం జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం కొంకల గ్రామానికి చెందిన తెలుగు చంద్రకళ కుమారుడు అశోక్ శాంతినగర్‌కు చెందిన యువతిని కొంతకాలంగా ప్రేమిస్తున్నాడు. అమ్మాయి తల్లిదండ్రులు వేరొకరితో నిశ్చితార్థం చేసినట్లు తెలిసి అశోక్ తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. అప్పటి నుంచి ముభావంగా ఉంటూ ఈనెల 24న ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు. 27వ తేదీన కర్నూలు కొత్తబస్టాండ్ సమీపంలో ఉన్న ఓ లాడ్జిలో గదిని అద్దెకు తీసుకుని స్నేహితుడు నవీన్‌తో కలసి మద్యం సేవించారు. ఖర్చులకు డబ్బులు తీసుకురమ్మని నవీన్‌ను తల్లి దగ్గరికి పంపాడు. అతను తిరిగి రాత్రి 9 గంటలకు లాడ్జికి వచ్చేసరికి అశోక్ గది తలుపులు మూసుకుని ఉండగా లాడ్జి సిబ్బంది సహాయంతో బద్దలుకొట్టారు. లోపలికి వెళ్లి చూడగా అశోక్ ఫ్యాన్‌కు ప్లాస్టిక్ తాడుతో ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే మృతదేహాన్ని కిందకు దింపి ఆటోలో ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుని తల్లి చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేసీలో గుర్తు తెలియని మృతదేహం

కర్నూలు: కేసీ కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహాన్ని అగ్నిమాపక శాఖ అధికారులు వెలికితీశారు. సుమారు 50 ఏళ్ల వయస్సు ఉన్న మృతదేహం కేసీ కెనాల్‌లో కొట్టుకొస్తుండగా వినాయక ఘాట్ వద్ద స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాలువలో గణేష్‌నగర్ వైపు కొట్టుకుపోవడంతో అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి మూడో పట్టణ పోలీసులకు అప్పగించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించి భద్రపరిచారు.

ఆవుకు అంతిమయాత్ర

- పాడి ఆవు మృతితో తల్లడిల్లిన రైతు కుటుంబం


మృతి చెందిన ఆవుకు అంతిమయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

ప్యాపిలి: ఇంటి కుటుంబసభ్యుడిలా చూసుకున్న ఆవు అనారోగ్యంతో మృతిచెందడంతో పాడిరైతు తల్లడిల్లిపోయాడు. ఎడ్లబండిపై అంతిమయాత్ర నిర్వహించి తన ప్రేమను చాటుకున్నాడు. ప్యాపిలి మండలం చిన్నపొదిళ్ల గ్రామంలో బుధవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. చిన్నపొదిళ్లకు చెందిన రాజేంద్ర ఇంట్లో 2005 మే ఒకటో తేదీన ఆవుదూడ జన్మించింది. నాటి నుంచి ప్రతి ఏటా దాని పుట్టిన రోజు జరపడంతో పాటు కుటుంబంలో ఒకడిలా చూసుకున్నారు. ఇప్పటి వరకు 14 ఆవులు, ఎద్దులకు ఆ ఆవు జన్మనిచ్చింది. అయితే, బుధవారం ఆ ఆవు అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ రైతు కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపించింది. ఆవు కళేబరంపై వస్త్రం కప్పి, పూలతో అలంకరించి ఎడ్లబండిపై అంతిమయాత్ర నిర్వహించింది. మృతి చెందిన ఆవు ఈనిన ఎద్దులే బండిని లాగుతున్న దృశ్యం తల్లి పాడెను తనయులు మోసినట్టు అనిపించింది. రాజేంద్ర తన పొలంలోనే ఆవుకు అంత్యక్రియలు నిర్వహించి సమాధి కట్టారు. గోవుపై రైతు పెంచుకున్న ప్రేమను చూసి స్థానికుల కళ్లు చెమ్మగిల్లాయి.

ఇంటర్మీడియట్ బోర్డు అధికారిపై విచారణ

- ఇంటర్ పరీక్షల నిర్వహణ నిధులు గోల్‌మాల్
- ఫిర్యాదు చేసిన విద్యార్థి సంఘం నాయకులు
- ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు


విచారణ జరుపుతున్న ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు

కర్నూలు సిటీ: పరీక్షల నిర్వహణ నిధులను దుర్వినియోగం చేసినట్లు ఓ విద్యార్థి సంఘం ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయంలోఆర్ఐఓ గురువయ్య శెట్టిపై విచారణ జరిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో నిర్వహించిన పరీక్షల నిర్వహణ నిధులను దుర్వినియోగం చేసినట్లు ఓ విద్యార్థి సంఘం ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్, కార్యదర్శి కృతికశుక్లాకు ఈ నెల 20వ తేదిన ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన కమిషనర్ విచారణకు ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో బోర్డు పరీక్షల విభాగం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ వి.సుబ్బారావు, జాయింట్ సెక్రటరీ నాగమణిలతో పాటు, మరో అధికారి ఉన్నారు. విచారణలో పాల్గొన్న ఇంటర్ బోర్డు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ వి.సుబ్బారావు, జాయింట్ సెక్రటరీ నాగమణి.. ముందుగానే వారు తయారు చేసుకున్న ప్రశ్నలను ఆర్ఐఓ ఆఫీస్ సిబ్బంది, జూనియర్ లెక్చరర్స్, ప్రిన్సిపాల్స్ అసోసియేషన్, ప్రైవేటు జూనియర్ కాలేజీలకు చెందిన కరస్పాండెంట్ల ముందుంచి సమాధానాలు రాయించుకున్నారు. ఆ తరువాత పరీక్షల సమయంలో పనిచేసిన డీఈసీ సభ్యులు, కాన్ఫిడెన్షియల్ సామగ్రిని తరలించిన వాహనాలు, డీఈసీ సభ్యులు వినియోగించిన వాహనాల రీడింగ్, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్ఐఓపై ఫిర్యాదు చేసిన డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మహేంద్ర నాయుడును అధికారులు విచారణ జరిపారు. స్పాట్ వాల్యూయేషన్ క్యాంపులో బాయ్స్‌కు ఇచ్చే రెమ్యూనరేషన్‌లో అవసరం కంటే అధికంగా నిధులు డ్రా చేశారని, పరీక్షల సమయంలో డీఈసీ(డిస్ట్రిక్ ఎగ్జామినేషన్ కమిటీ) సభ్యులు వినియోగించిన వాహనాల రీడింగ్ నమోదులోను అక్రమాలు చోటు చేసుకున్నట్లు, ఇందుకు సంబంధించిన ఆధారాలను అధికారులకు అందజేశారు. అదే విధంగా ఆర్ఐఓ కాలేజీలకు తనిఖీలకు పోయిన సమయంలో డ్రైవర్ రాంబాబు ఫోన్‌కి డిజిటల్ పేమెంట్లు చేయించుకున్నట్లు, డ్రైవర్ అకౌంట్, ఆఫీస్ బ్యాంకు ఖాతాల నగదు డ్రా, తదితర ఆర్థిక పరమైన విషయాలను అందజేశారు. బ్యాంకుల్లో భారీగానే నగదు బదలాయింపు జరిగినట్లు తెలుస్తోంది. విచారణ ఉదయం 11 గంటలకు మొదలై రాత్రి 7 గంటల వరకు జరిగింది.

అనుకూలంగా చెప్పాలని....

ప్రాక్టికల్స్, కాలేజీల విజిట్ సంబంధించిన విషయాలపై అధికారులు ఆరా తీశారు. అయితే ఈ విషయం ముందుగానే తెలుసుకున్న ఆర్ఐఓ తనకు అనుకూలంగా ఉండే ప్రైవేటు కాలేజీలకు చెందిన కొంత మందిని మాత్రమే విచారణకు హాజరయ్యేటట్లు చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే కొందరు ప్రిన్సిపాళ్లతో పాటు, మరి కొంత మంది ఆర్ఐఓకు వ్యతిరేకంగా చెప్పినట్లు సమాచారం.